# సమయానికి చేరని ఉత్తరాలు

కథ

ఎ.వి.రెడ్డి శాస్త్రి

నాకో ఉత్తరం వచ్చింది చాలా రోజుల కిందట. దాన్ని చదవడానికి నానా తంటాలు పడవలసి వచ్చింది. ఓ పట్టాన బోధపడి చావలేదు. ఇవాళో ముక్క, రేపో ముక్క... ఇలా చాలా రోజులు పట్టేసింది; పూర్తిగా అర్థ౧వయిూటప్పటికి. తీరా చూస్తే ఆ రాసిన వాడు వొకప్పటి నా ప్రాణమిత్రుడు. చాలా ఏళ్ల బట్టి మామధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు లేకపోవడం వల్ల కాబోలు వెంటనే గుర్తుకు రాలేదు వాడు. ఇంతకీ వాడు రాసిందే౧విటో తెలుసునా? 'నీవల్ల మాత్రమే జరిగే పనో టుంది- చేసి పెట్టగలవా అని. ఆలోచించేను- చాలా కాలం ఆలోచించేను- నా వల్ల కావలసిన పనేమిటి చెప్మా అని. నాకా- బాగా వయసు వచ్చేసింది. ఈ వయసులో ఇంకా నేను చేయగలిగిన పనులే౧విటుంటాయో నాకర్థం కాలేదు.

ఈ రకంగా ఆలోచిస్తూ కూర్చోడంతో చాలా కాలం గడిచిపోయింది. ఇంకా ఆలోచిస్తూ కూర్చుంటే ఇక ఎన్నటికీ జవాబు రాయడం కుదరదని అనిపించి, జవాబు రాసేసేను. కానీ ఆ జవాబు నాకెంతమాత్రం సంతృప్తి కలిగించలేదు. మరి కొన్నాళ్ల తాత్సారం చేస్తే ఆ మిత్రుడి మనసులో లేనిపోని అనుమానాలు కలిగించిన వాడినౌతానని భయం వేసింది. దాంతో ఆ ఉత్తరాన్ని తీసికెళ్లి రెండు వీధుల కవతల కుంగిపోయి, కూలిపోవడానికి సిద్ధంగా వున్న ఓ ఇంటి గేటుకి వేలాడతీసి వున్న పోస్టు డబ్బాలో పడేశాను. తీరా పడేశాక రకరకాల అనుమానాలు ఆరంభ౧వయినాయి. అన్నిటి కన్నా అసలీ డబ్బాలో ఉత్తరాలు తీస్తున్నారా? అన్నది పెద్ద అనుమాన౧వై కూర్చుంది. సరే, ఓ వారం రోజుల్లో ఏ జవాబూ రాకపోతే ఉత్తరం చేరనట్లే లెక్క అని నిశ్చయించుకొని మనసుని సమాధాన పర్చుకున్నాను.

చాలా రోజులైపోయింది ఇంకా జవాబు రాలేదే౧విటి చెప్మా అని నేనకుంటున్న సమయంలో జవాబొచ్చింది. సంతోషపడిపోతూ ఉత్తరం విప్పేను. తీరా చదివితే ఒక్కటే ముక్క వుంది అందులో. 'నా ఉత్తరానికి ఇంతవరకు నీ దగ్గర్నుండి ఏ సమాధానం లేదు' అని. ఆ ఉత్తరం చదివీ చదవగానే చెప్పడానికి వీల్లేనంత నిరాశ, నిస్పృహలు నన్ను ఆవహించేయి. నీరసం వచ్చేసినట్టనిపించి కుర్చీలో కూలబడిపోయాను. ఎన్నాళ్లో, ఎన్నాళ్లో ఆలోచించి ఉత్తరం రాస్తే, ఆ ఉత్తరం కాస్త పత్తా లేకుండా ఏ చావు ఉత్తరాల లోకానికో చేరుకుందన్న మాట. సరే!

ఈ నిరాశ నుండి బయటపడడానికి మళ్లా చాలా కాలం పట్టేసింది. మళ్లా నానా తంటాలు పడి ఉత్తరం రాసేను. అలాగే నీ పని తప్పకుండా చేసి పెడతాను. నేను చేయగలిగిన పనైతే అని. మళ్లా ఆ పాత పోస్టు డబ్బా దగ్గరకే కాళ్లీడ్చుకుంటూ వెళ్లేను ఉత్తరం వెయ్యడానికి. విరిగిపోతున్న ఓ గేటుకి ఈ పోస్టుడబ్బా వేలాడదీశారని చెప్పేను కదా! ఆ గేటు కెదురుగా కొన్ని పూరి గుడిశలున్నాయి. ఆ ఇళ్ళన్నిటికీ మట్టి అరుగులే. వాటి మీద కూర్చొని బియ్యాలు, పప్పులు బాగు చేసుకుంటూ ఉంటారు. చెప్పేను కదా! ఉత్తరం వెయ్యడానికి పోస్టు డబ్బా దగ్గరికి వెళ్లేనని. తీరా నేనూ ఉత్తరం పడేద్దాం అనుకుంటున్న సమయంలో ఆ అరుగుల మీద కూర్చున్న ఓ అమ్మాయి కిసుక్కున నవ్వింది నాకు వినిపించేంత గట్టిగా. నేను ఉత్తరం వెయ్యడం ఆపి, "ఎందుకు నవ్వుతున్నావని" అడిగేను. 'శాన్నాళ్ల నిండి ఆ డబ్బాలోంచి ఉత్తరాలు తియ్యడం లేదండీ- అందుకనే మీరుత్తరం ఏస్తంటే నవ్వొచ్చిందండీ' అంది. ఉస్సురని మనసంతా కుప్పకూలిపోయిన భావం కలిగింది. ఎందుకిలా జరుగుతోంది చెప్మా? ఆలోచనల్లో కూరుకుపోతోంది మనస్సు. మనం తలపెట్టిందొకటైతే జరిగింది మరొకటెందుకౌతూ వుంటుందీ? ఎంతసేపు మథన పడినా ఏ సమాధానం దొరకని సమస్య ఇది. అంచేత కాసేపు తంటాలు పడి మనసును స్వాధీనంలోకి తెచ్చుకున్నాను. కానీ ఏం లాభం. ఇప్పుడేం చెయ్యాలన్నది మళ్లీ ఎంతకీ తెగని మరో ఆలోచన. నా ఉత్తరాలు చేరవలసిన చోటికి అసలు చేరే వుండవు. అందుకనే ఈ అవగాహన లోపం. దీన్నంతట్నీ సరిచెయ్యాలంటే ఉత్తరాల్లో నేనింతవరకూ రాసిన సంగతులన్నీ తిరిగి మరో ఉత్తరంలో సవివరంగా రాసి, నా ఉత్తరాలు ఎందుకు చేరలేదో వివరించుకోవాలి. ఎప్పుడో రాసిన సంగతులన్నీ గుర్తు తెచ్చుకొని మళ్లీ రాయాలన్న ఆలోచనే చెప్పలేనంత నిస్పృహ కలిగిస్తోంది.



సంకల్పం వెనకబడిపోయింది. ఉత్తరం రాయాలని సంకల్పం వున్నా, ఆలోచనల్ని నియంత్రించుకుంటూ ఉత్తరం రాయడం నా శక్తికి మించిన పననిపించి రాయడం బద్ధకించేశాను. కానీ మనసును సమాధానపరచుకోవడం కుదరడం లేదు. చివరికి మళ్లీ బోలెడు ప్రయత్నం చేసి మరో ఉత్తరం రాసి ఈసారి నేరుగా హెడ్పోస్టాఫీసుకి వెళ్లి మరీ పోస్టు చేశాను. చాలాకాలం పోయేక నా ఉత్తరానికి సమాధానం వచ్చింది. నా స్నేహితుడి దగ్గర నుంచికాదు- వాడి కొడుకు దగ్గర్నుంచి. "మీవల్ల కావలసిన ముఖ్యమైన పనేదో వుందనీ, మీకు ఉత్తరం రాశాననీ, కానీ జవాబు ఎన్నాళ్లు వేచి చూసినా రావడంలేదనీ బాధపడుతూ ఉండేవారు. ఓ విధంగా మీ ఉత్తరం కోసం వేచి చూడడమే అతని దినచర్యయిపోయింది. తీరా అతనికి కావలసిన సమాధానంతో మీఉత్తరం వచ్చేసరికి ఆయన ఈ లోకంలోనే లేకుండా పోయేరు" అని.

●